వేగంగా రైల్వేరోడ్డు పనులు



రైల్వేరోడ్డులో తొలగించిన భవనాలు



నందిసర్కిల్ నుంచి రోడ్డు పక్కన నిర్మించిన కాల్వ

- రూ.1.50 కోట్లతో రహదారి విస్తరణ
- ఇప్పటికే భవనాల తొలగింపు పూర్తి
- నెలరోజుల్లో పూర్తి చేస్తామంటున్న అధికారులు

హిందూపురం: పట్టణ వాసుల కల అతి త్వరలో సాకారం కానుంది. పట్టణ నడిబొడ్డున ఉన్న రైల్వే రోడ్డు పూర్తిస్థాయిలో విస్తరించి మోడల్ రహదారిగా తీర్చిదిద్దేందుకు జరుగుతున్న పనులు వేగంగా సాగుతున్నాయి. రైల్వేరోడ్డు విస్తరణలో భాగంగా రోడ్డుకు ఇరుపక్కలా ఉన్న పెద్ద భవనాలు చాలావరకు రోడ్డు ముందు భాగంగా స్వచ్ఛందంగా తొలగింపు చేపట్టారు. భవన యాజమానులు అంగీకరించి పత్రాలు సమర్పించిన వారి భవనాలు తొలగింపు ఖర్చుతో పాటు నష్టపరిహారంగా రూ.లక్షకు నాలుగింతలు రెట్టింపుతో (రూ.లక్షకు నాలుగు లక్షలు) టీటీఆర్ అందిస్తుండటం సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఇప్పటికే సుమారు 75 శాతం తొలగింపులు పూర్తయ్యాయి. కేవలం 45 మంది మాత్రమే భవనాలు తొలగించాల్సి ఉంది. ఇందులోనూ 25 మంది అంగీకరపత్రాలు ఇచ్చేశారు. మిగిలిన వారు అనుమతి పత్రాలు ఇస్తే పనులు మరింత వేగవంతం అవుతాయని అధికారులు చెబుతున్నారు. అంగీకరించకపోయినా భూసేకరణ చట్టం నిబంధనల మేరకు నష్టపరిహారం చెల్లించి పనులు చేపడతామని అంటున్నారు.

లక్ష్యం	రైల్వేరోడ్డు విస్తరణ సుందరీకరణతో నిర్మాణం
పొడవు	1 కి.మీ (నంది సర్కిల్ నుంచి ఎన్టీఆర్ సర్కిల్)
విస్తీర్ణం	70 అడుగుల మాస్టర్ ప్లాన్
అంచనా వ్యయం	రూ.1.50 కోట్లు
ఇరు పక్కలా పెద్ద కాల్వల నిర్మాణ వ్యయం	రూ.86 లక్షలు

ప్రజల ఆకాంక్ష నెరవేరుస్తున్నాం



హిందూపురం ప్రజల ఆకాంక్షను త్వరలోనే నేరవేర్చబోతున్నాం. ఇప్పటికే మున్సిపాల్టీ నిధులతో పనులను మొదలుపెట్టాం. రైల్వే రోడ్డు నిర్మాణానికి అవసరమైన నిధులను ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరాము. అతిత్వరలోనే నిధులతో పాటు మున్సిపల్ నిధులతో ఏళ్ల తరబడిగా ఉన్న సమస్యను పరిష్కరిస్తాం.

– మహమ్మద్ ఇక్బాల్, ఎమ్మెల్సీ

నెలలోపు పూర్తిచేస్తాం



హిందూపురం రైల్వే రోడ్డు విస్తరణ, సుందీకరణతో పనులు చేపట్టాము. ఇప్పటికే రూ.86 లక్షల నిధులతో రోడ్డుకు ఇరువైపులా కాలువ నిర్మాణ పనులు చేస్తున్నాం. దీంతో పాటు ఒక పక్క నుంచి రోడ్డు నిర్మాణానికి సంబంధించి గ్రావెల్ వర్క్ మొదలు పెడుతున్నాం. మరోనెలలో మొత్తం పనులు పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.

– వెంకటేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్, హిందూపురం

జగనన్నను మళ్లీ సీఎం చేసుకుందాం



బూదిలిలో గడప గడపకూ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే శంకరనారాయణ

సోమందేపల్లి: ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకర నారాయణ పిలుపునిచ్చారు. శనివారం సోమందేపల్లిలో గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లకు నిర్వహించిన శిక్షణా తరగతులకు ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. 2014 ఎన్నికల్లో మోసపూరిత హామీలిచ్చి ఆ తర్వాత పట్టించుకోని ప్రతి పక్ష నేత చంద్రబాబు మోసాలు ప్రజలకు వివరించాలని సూచించారు. అర్హత ఉన్న లబ్ధిదారులందరికీ కచ్చితంగా సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణరెడ్డి, మాజీ కన్వీనర్ వెంకటరత్నం, జెడ్పీటీసీ అశోక్, సచివాలయ కన్వీనర్ ఇమామ్‌వలి తదితరులు పాల్గొన్నారు.

అవినీతిరహిత పాలనే ప్రభుత్వ లక్ష్యం

గోరంట్ల: కుల,మత ,రాజకీయలకు అతీతంగా అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందించడంతో పాటు అవినీతి రహిత పాలన సాగించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ముందుకు సాగుతున్నట్లు ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ పేర్కొన్నారు. శనివారం మండలంలోని బూదిలిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ లబ్ధిని వివరించారు. సమస్యలు తెలుసుకొని వాటిని సత్వరం పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రబాబు అండ్ కో వచ్చే ఎన్నికల్లో ఎలాగైన అధికారం చేజిక్కించుకోవాలని సీఎం జగన్ ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని, వారి కుట్రలు, కుతంత్రలు ప్రజలు తిప్పికొట్టి పేదల కోసం పరితపిస్తున్న సీఎం జగన్‌ను ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రామాంజనేయులు, గోరంట్ల మార్కెట్ యార్డు అధ్యక్షుడు బూదిలి వేణుగోపాల్ రెడ్డి , వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, జిల్లా సహకార బ్యాంకు డైరెక్టర్ పాటూరి శంకరెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ ఫక్రుద్దీన్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

పరిగి (సోమందేపల్లి): పరిగి మండలం శాసన కోటకు చెందిన వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకుడు ఇలియాజ్ (52) గుండెపోటుతో శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శంకర నారాయణ గ్రామానికి చేరుకొని ఇలియాజ్ మృతదేహం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

సోమందేపల్లి: మండలంలోని మాగేచెరువు గ్రామంలో శనివారం కొల్హాపూరి మహాలక్ష్మి బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే శంకర నారాయణ పూజల్లో పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు గృహ సారథులకు శిక్షణ

లేపాక్షి: మండల కేంద్రమైన లేపాక్షి వెలుగు కార్యాలయంలో ఆదివారం మధ్యాహ్నం 1.30 గంటలకు అన్ని సచివాలయాల పరిధిలో ఉన్న గృహ సారథులకు శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ ముఖ్య అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు.

మడకశిర (అగళి): అగళి మండలంలోని గృహ సారథులు, వలంటీర్లకు ఆదివారం ఉదయం 11 గంటలకు అగళిలోని ఆర్‌కే కల్యాణ మండపంలో శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు జేసీఎస్ కన్వీనర్ శివన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే తిప్పేస్వామి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు.

ఘనంగా వేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

అమరాపురం: మండల కేంద్రంలో వెలసిన ప్రసన్న లక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామి వారు హనుమద్వాహనంపై ఊరేగించారు. ఈ సందర్భంగా అర్చకులు శ్రీనిధి భట్టాచార్యులు స్వామి వారికి ఉదయం సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం తదితర పూజలు చేశారు. ఆర్యవైశ్య సంఘం సభ్యులు, మహిళా భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.

నేడు బ్రహ్మ రథోత్సవం..

ప్రసన్న లక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం మాఘ శుద్ధ పూర్ణిమను పురస్కరించుకుని స్వామి వారి బ్రహ్మ రథోత్సవాన్ని మధ్యాహ్నం 1–30కు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

రథం మరమ్మతుకు విరాళం

హిందూపురం టౌన్: పట్టణంలోని మెయిన్ బజార్‌లో వెలసిన పేట వెంకటరమణస్వామి రథం మరమ్మతుకు రథోత్సవ కమిటీ సభ్యులు రూ.20 వేలను విరాళంగా అందజేశారు. శనివారం ఆలయంలో మొత్తాన్ని దేవాదాయ ఇన్‌స్పెక్టర్ నరసింహరాజు, ఈఓ నరసింహమూర్తిలకు కమిటీ సభ్యులు అందజేశారు.

ఉచిత వైద్యశిబిరం

హిందూపురం టౌన్: పట్టణంలోని ఆజాద్‌నగర్‌లోని షక్రీయా మసీదులో మదీన మెడికల్ ఏజెన్సీ, బ్లూ క్రాస్ ల్యాబొరేటరీ ఆధ్వర్యంలో శనివారం ఉచితంగా వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు ఖదీజా షేక్ ఆధ్వర్యంలో పలువురికి బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. శిబిరంలో పాల్గొన్న వారికి మదీన మెడికల్ ఏజెన్సీ ప్రతినిధులు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రియాజ్, జవీద్ ఆలం , ఉబేదుల్లా, ఫయాజ్, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

8న వైబీ హళ్లి చెరువు వేలం

మడకశిరరూరల్: మండల పరిధిలోని వైబీహళ్లి చెరువులో చేపల పెంపకానికి ఈనెల 8న గ్రామ సచివాలయంలో సర్పంచ్ రామాంజనేయులు, ఈఓఆర్డీ శైలజ సమక్షంలో వేలం పాట నిర్వహిస్తున్నట్లు గ్రామ కార్యదర్శి కృష్ణమూర్తి తెలిపారు. అలాగే పంచాయతీలోని చింత చెట్లకు కూడా వేలం పాట నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి గల వేలంలో పాల్గొనాలన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



ఆలయం వద్ద హోమాలు నిర్వహిస్తున్న అర్చకులు

రొద్దం: మండల పరిధిలోని ఆర్ మరువపల్లి పాత చెక్ పోస్ట్ ఉన్న షిర్డిసాయి ఆలయ 17వ వార్షికోత్సవం శనివారం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయం వద్ద హోమాలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయం రొద్దం పెద్దాంజనేయస్వామి దేవాలయం నుంచి మహిళలు జ్యోతులతో తరలి వచ్చి స్వామివారికి సమర్పించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



రొళ్లలో శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

రొళ్ల: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లి మరోసారి వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తీసురావాలని ఎమ్మెల్యే తిప్పేస్వామి పేర్కొన్నారు. శనివారం మధ్యాహ్నం పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయం ఆవరణలో సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తిప్పేస్వామి మాట్లాడుతు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయన్నారు. ప్రతిపక్ష పార్టీలు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా ప్రజలు నమ్మేపరిస్థితి లేదన్నారు. సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేసి వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ రత్నమ్మ, ఎంపీటీసీ సౌమ్య, నాయకులు నాగేష్ రంగారెడ్డి, నాగేంద్ర, మార్కెట్ యార్డు డైరెక్టర్ శ్రీనివాస్, సింగిల్ విండో అధ్యక్షుడు మోతిరాంనాయక్, కోఆప్షన్ సభ్యుడు అల్లాబకాష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

మడకశిర: మడకశిర నియోజకవర్గ పర్యటనకు వచ్చిన విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాశ్‌ను శనివారం స్థానిక ఆర్అండ్‌బీ బంగ్లాలో స్థానిక ఎమ్మెల్యే తిప్పేస్వామి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నియోజకవర్గంలోని పలు విద్యారంగ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. అన్ని మండలాలకు రెగ్యులర్ ఎంఈఓలను నియమించాలని, నియోజకవర్గంలో టీచర్ పోస్టులను భర్తీ చేసి విద్యార్థులు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు.

రేపు హుండీ కానుకల లెక్కింపు

లేపాక్షి: స్థానిక వీరభద్రస్వామి దేవాలయంలో సోమవారం ఉదయం 10.30 గంటలకు హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమం జరుగుతుందని ఆలయ కార్యనిర్వహణాధికారి నరసింహమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

మడకశిర: నియోజకవర్గంలోని విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మడకశిరలో శనివారం విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్‌ప్రకాశ్‌కు జిల్లా ఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షుడు ఈరేష్, నాయకులు భరత్, కృష్ణ, నరేష్ తదితరులు వినతి పత్రాన్ని సమర్పించారు.ఈ సందర్భంగా నియోజకవర్గంలో ప్రైవేటు పాఠశాలలు వ్యవహరిస్తున్న తీరుపై కూడా నాయకులు వినతిపత్రం అందజేశారు.

మడకశిరరరూరల్: మడకశిరలో శనివారం పర్యటించిన విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాష్‌ను స్థానిక ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లోజిల్లా వైఎస్సార్‌టీఎఫ్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వైఎస్సార్‌టీఎఫ్ అధ్యక్షుడు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, ఉపాధ్యక్షుడు ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

రొద్దం: నల్లూరుకు చెందిన నాగరాజు, సిద్దప్ప ఇళ్లలో తనిఖీ చేయగా 104 టెట్రా ప్యాకెట్లు దొరికినట్లు ఎస్ఐ నాగస్వామి తెలిపారు. వారిద్దరిని అదుపులోకి తీసుకుకొని కేసు నమోదు చేశామన్నారు.

డీసీఓ ఉద్యోగులకు సన్మానం

హిందూపురం: విధుల నిర్వహణలో చిత్తశుద్ధి చూపుతూ అంకితభావంతో పనిచేస్తే ప్రభుత్వ ఉద్యోగులకు గుర్తింపు లభిస్తుందని డీసీఓ కృష్ణానాయక్ తెలిపారు. శనివారం హిందూపురం డివిజనల్ సహకార అధికారి కార్యాలయంలో సమీక్షించారు. కలెక్టర్‌తో ఉత్తమ ఉద్యోగిగా ప్రశంసాపత్రం అందుకొన్న డీసీఓ కృష్ణానాయక్‌తో పాటు హియరింగ్ హ్యాండీ క్యాప్డ్ ఉద్యోగుల అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికైన శ్రీరాములును సంయుక్తంగా జిల్లా సహకార ఉద్యోగులు సన్మానించారు.

రక్తహీనత ఉన్న వారిని గుర్తించండి

పెనుకొండ: రక్తహీనత ఉన్న గర్భిణులు, బాలింతలను గుర్తించి వారికి అంగన్‌వాడీ కేంద్రాల్లోనే భోజనం చేసేలా చర్యలు చేపట్టాలని సీడీపీఓ శాంతలక్ష్మి మహిళా సంరక్షణ కార్యదర్శులకు సూచించారు. పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో శనివారం మహిళా సంరణా కార్యదర్శులతో ఆమె సమావేశం నిర్వహించి సూచనలిచ్చారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి



హిందూపురం: మోడల్‌కాలనీలో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్సీ మహమ్మద్‌ఇక్బాల్

చిలమత్తూరు: ప్రజలకు దగ్గరవ్వడం కంటే సీఎం జగన్‌ని ఎలా దించాలన్నదానిపైనే టీడీపీ నాయకులు లక్ష్యంగా ముందుకు వెళ్తున్నారని ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఆర్బీకేలో గృహసారథులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తోడేళ్లన్నీ ఏకమైన విషయాన్ని ప్రతి ఒక్కరూ దృష్టిలో ఉంచుకొని పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. రాయలసీమకు హైకోర్టు రాకుండా కుట్ర పన్నిన వ్యక్తి చంద్రబాబు అని అలాంటి వ్యక్తి రాయలసీమ ద్రోహి కాక మరేమవుతారని ప్రశ్నించారు. క్రైస్తవులు శ్మశాన వాటికకు ఇవ్వాలని ఎమ్మెల్సీకి విన్నవించగా సమస్య పరిష్కరించాలని ఆయన తహసీల్దార్‌కు సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అనూష, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమంతో లబ్ధిదారుల్లో సంతోషం

హిందూపురం: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు సచివాలయ వ్యవస్థ ద్వారా నేరుగా లబ్ధిదారులకు చేరుతుండటంతో ప్రజలందరూ సంతోషం వ్యక్తం చేస్తున్నారని ఎమ్మెల్సీ మహమ్మద్‌ఇక్బాల్ అన్నారు. గడప గడపకూ మనప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శనివారం మున్సిపాల్టీ పరిధిలోని 11వ వార్డు మోడల్‌కాలనీలో ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, వార్డు బీజేపీ కౌన్సిలర్ అంజలీ, వార్డు ఇన్‌చార్జి చంద్ తదితరులతో కలిసి కాలనీలో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ఆయా ఇంటికి ప్రభుత్వం ద్వారా అందించిన సంక్షేమ ఫలాలను వివరించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ అన్నిచోట టీడీపీ వాళ్లు కూడా వివక్ష లేకుండా మా ఇంటికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెబుతున్నారని పేర్కొన్నారు.

బాధితునికి పరామర్శ

రోడ్డు ప్రమాదంలో గాయపడిన హిందూపురం మండలం మణేసముద్రంకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు గిరిష్‌కుమార్‌ను శనివారం ఎమ్మెల్సీ మహమ్మద్‌ఇక్బాల్ ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆయన వెంట చైర్‌పర్సన్ ఇంద్రజ తదితరులున్నారు.

నూతన పింఛన్ల పంపిణీ

లేపాక్షి: మండలంలోని కోడిపల్లి పంచాయతీ పరిధిలోని కొత్తపల్లికి చెందిన షమీవుల్లాకు కొత్త మంజూరైన పింఛన్ రూ.5 వేలను ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ చేతులు మీదుగా శనివారం అందజేశారు.

'మా భూములు మాకు ఇవ్వాలి'

లేపాక్షి: 'మండలంలోని కొండూరు సమీపంలో కుశలవ ఆర్గానిక్ యాజమాన్యం తమకు మాయ మాటలు చెప్పి విలువైన భూములను కాజేసారు. మా భూములు మాకు ఇవ్వాలి' అంటూ బాధితులు శనివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. తహసీల్దార్ మాట్లాడుతూ పలువురు ఎస్సీ,ఎస్టీ వర్గాల వారు కుశలవ ఆర్గనిక్ ప్రొడక్ట్స్ యాజమాన్యంపై ఫిర్యాదు చేశారన్నారు. ఎస్సీ కమీషన్ ఆదేశాల మేరకు కొన్నవారికి, అమ్మినవారికి జనవరి 6న నోటీసులు జారీ చేశామన్నారు. ఇరువర్గాల అభిప్రాయాలు తీసుకున్న తరవాత తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

అర్హత ఉన్న వారికి ప్రతి ఫలాలు అందాలి

అమరాపురం: గ్రామాల్లో అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించాలని ఎంపీడీఓ మునిస్వామి పేర్కొన్నారు. శనివారం మండలంలోని బసవనపల్లి గ్రామ సచివాలయంలో సర్పంచ్ భాగ్యమ్మ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మునిస్వామి మాట్లాడుతూ వలంటీర్లు, సచివాలయం సిబ్బంది సమన్వయంతో ప్రతి కుటుంబంలోని సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించాలన్నారు. ఎంపీపీ ఈరన్న, జెడ్పీటీసీ సభ్యురాలు స్వారక్క, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు, పాల్గొన్నారు.

ఆహారపు అలవాట్లే క్యాన్సర్‌కు కారణం

పెనుకొండ: ఆహారపు అలవాట్లే క్యాన్సర్‌కు కారణమని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ చెన్నారెడ్డి, జంతుశాస్త్ర అధ్యాపకులు హరీష్‌బాబు పేర్కొన్నారు. పట్టణంలోని కళాశాలలో శనివారం ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని ఎన్ఎస్ఎస్, జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంత అధ్యాపకులు మాట్లాడుతూ ఆహారపు అలవాట్లు, చెడు అలవాట్ల కారణంగానే క్యాన్సర్ సోకుతుందన్నారు.

మురికినీటి విషయంలో ఘర్షణ

- ముగ్గురికి తీవ్ర గాయాలు

పెనుకొండ రూరల్: పట్టణ పరిధిలోని రాజేశ్వరి కాలనీలో శనివారం మురికి నీటి విషయంలో వడ్డిరాజు, కురుబ హనుమంతు గొడవ పడ్డారు. తీవ్రంగా గాయపడిన కురుబ హనుమంతు, రత్నమ్మలతో పాటు వారి కుమారుడు శివప్రసాద్, 108 వాహనం ద్వారా పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం హనుమంతు, రత్నమ్మ బలమైన గాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. ఈ ఘటనపై 'సాక్షి' ఎస్ఐ రమేష్‌బాబు వివరణ కోరగా.. వడ్డిరాజు, కురుబ హనుమంత ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టామన్నారు. నిజం నిగ్గుతేలిన తర్వాత నిందితులపై చర్యలు చేపడతామన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

హిందూపురం: కష్టపడి చదివివారే ఉన్నతస్థానాలకు చేరుకోగలరని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, మున్సిపల్ వైస్‌చైర్మన్ బలరామిరెడ్డి అన్నారు. బాలయేసు జూనియర్ కళాశాల యాజమాన్యం ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు శనివారం ప్రతిభా పురస్కారాలు అందజేశారు. సీనియర్ ఇంటర్‌లో అత్యధికంగా 980 మార్కులు సాధించిన మానసకు ల్యాప్‌టాప్‌ను బహుమతిగా అందించారు. అలాగే అజారాఫాతిమా, శ్రావణి, శ్రీఅక్షయ, లిఖితలకు రూ.5 వేలు ప్రకారం నగదు బహుమతి అందించారు. జూనియర్ ఇంటర్‌లో ప్రతిభకనపర్చిన విద్యార్థులకు అవార్డులతో పాటు పురస్కరాలు అందించారు. కార్యక్రమంలో కళాశాల ఏఓ శౌరిరెడ్డి, ప్రిన్సిపల్ శ్రీనాథ్‌రెడ్డి, రామమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పెద్ద చెరువు వేలం

మడకశిరరూరల్: మండల పరిధిలోని హరేసముద్రం పెద్ద చెరువులో చేపల పెంపకానికి శనివారం గ్రామ సచివాలయంలో సర్పంచ్ కరియన్న, ఈఓఆర్డీ శైలజ, గ్రామ కార్యదర్శి సావిత్రి సమక్షంలో వేలం పాట నిర్వహించారు. హిమంతరాజు అనే వ్యక్తి రూ.3.60 లక్షలకు పాట పాడి దక్కించుకున్నట్లు వారు తెలిపారు.